మహిళలకు రక్షణ కల్పించాలి



గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో నైట్ డ్యూటీలు చేసే వైద్య సిబ్బందికి కనీసం ఒక కానిస్టేబుల్‌తో భద్రత ఏర్పాటు చేయాలి. అదే రిమ్స్ అయితే ప్రతి డిపార్ట్‌మెంట్‌కు ఒక కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేయాలి. కొన్ని సందర్భాల్లో పేషెంట్స్, వారి బంధువులు దాడి చేస్తుంటారు. అలాగే సీసీ టీవీ కవరేజ్ ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ జ్ఞాన ప్రసూన, పెద్దచెప్పలి పీహెచ్‌సీ



భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి



ప్రతి మహిళకు భద్రత తప్పనిసరి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల భద్రతకు ప్రత్యేకమైన వ్యవస్థను రూపొందించాలి. మహిళలపై అత్యాచారాలు, దాడులు పునరావృతం కాకుండా చూడాలి. కఠినమైన చట్టాలు తీసుకురావాలి. ముఖ్యంగా వైద్య సిబ్బందికి ప్రత్యేక రక్షణ కల్పించాలి.

– డాక్టర్ జోత్స్న, వైద్యాధికారిణి, మండల పీహెచ్‌సీ, ఎర్రగుంట్ల.



తప్పు చేసిన వారిని వెంటనే శిక్షించాలి



వైద్య సిబ్బందిపై దాడులకు పాల్పడిన వారిని తక్షణం శిక్షించాలి. డాక్టర్లకే రక్షణ లేనప్పుడు క్షేత్రస్థాయిలో పనిచేసే తమలాంటి వారికి భద్రత ఎలా ఉంటుంది. ఏదైన సంఘటన జరిగినప్పుడు పోలీసులు తక్షణం స్పందించాలి. దిశ యాప్‌ను అందరూ వినియోగించాలి. వైద్య సిబ్బందిపై దాడులు జరిగినప్పుడు ప్రజలు కూడా స్పందించాలి.

–ధనలక్ష్మి, ఏఎస్ఎం, కమలాపురం.



చిన్నచూపు చూస్తే శిక్షించాలి



మహిళలను చిన్న చూపు చూస్తున్న వారిని వెంటనే శిక్షించాలి. మహిళలపై దాడులు, అత్యాచారాలు చేస్తున్న వారిని ఎన్‌కౌంటర్ చేయాలి. అలా చేస్తేనే మహిళలపై దాడులు కొంత మేరకు తగ్గుతాయి. స్త్రీలపై అసభ్యకరంగా ప్రవర్తించేవారిని క్షమించరాదు. రాత్రిళ్ల డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్లే మహిళలకు రక్షణ చర్యలు చేపట్టాలి.

– లక్ష్మీదేవి, హెల్త్ సూపర్‌వైజర్, ఎర్రగుంట్ల

క్లుప్తంగా

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)కి ఆదివారం ప్రముఖ వైద్య నిపు ణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అలాగే ఆదివారం ఉదయం 6 గంటల నుంచి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించి ప్రముఖ షుగర్ స్పెషలిస్టు డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. షుగర్ పరీక్ష చేయించుకోవాలనుకునే వారు పరగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

పులివెందుల అర్బన్ సీఐగా రంగనాథబాబు



పులివెందుల రూరల్ : స్థానిక అర్బన్ సీఐగా శుక్రవారం జీవన్ రంగనాథబాబు బాధ్యతలు చేపట్టారు. అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లె సీఐగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల అర్బన్ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, జూదం నిర్వహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం డీఎస్పీ మురళీనాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

పర్యావరణాన్ని కాపాడండి

తొండూరు : చెట్లను నాటి పర్యావరణాన్ని కాపాడాలని జాయింట్ కలెక్టర్ అధితిసింగ్ తెలిపారు. శుక్రవారం తొండూరు శివాలయంలో గ్రామసభను సర్పంచ్ రాజేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభకు హాజరైన జేసీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. అనంతరం గ్రామ సభలో వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. అనంతరం తొండూరు బీసీ బాలికల గురుకుల పాఠశాలను ఆమె పరిశీలించి అక్కడ ఉన్న వసతులపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామచంద్రుడు, ఎంపీడీఓ విష్ణుప్రసాద్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీసులు వేధిస్తున్నారు

ముద్దనూరు : మండలంలోని వేల్పుచెర్ల గ్రామానికి చెందిన వ్యక్తిని పోలీసులు విచారణ పేరుతో వేధిస్తున్నారని ఎమ్మార్పీఎస్ నాయకులు విశ్వనాథ, వేంకటేశు, రమణ తదితరులు శుక్రవారం ఆరోపించారు. స్థానిక పోలీసుస్టేషన్ వద్ద వారు మాట్లాడుతూ వేల్పుచెర్ల గ్రామానికి చెందిన నాగరాజు అనే దళిత వ్యక్తి ఏప్రిల్ 24వ తేదీన రైలుకింద పడి మరణించాడు. ఈ కేసును రైల్వేపోలీసులు అనుమానంతో స్థానిక పోలీసులకు బదలాయించారు. వేల్పుచెర్ల గ్రామానికి చెందిన మరో వ్యక్తిపై అనుమానంతో పోలీసులు స్టేషన్‌కు పిలిపించి వేధిస్తున్నారన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకుల ఆరోపణలపై సీఐ దస్తగిరి స్పందిస్తూ నాగరాజు మరణంపై సందేహాలున్నాయని, ఈ కేసులో భాగంగా కొంతమందిని చట్టప్రకారమే విచారణ చేస్తున్నామని ఎవరినీ వేధించలేదని తెలిపారు.

కష్టపడి చదివితే మంచి భవిష్యత్

పెండ్లిమర్రి : విద్యార్థులు ఇంటర్‌మీడియట్ నుంచి కష్టపడి చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి తెలిపారు. పెండ్లిమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాగా చదివి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తెవాలన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసి కళాశాల అవరణలో మొక్కలు నాటారు. అలాగే పెండ్లిమర్రి గ్రామ సచివాలయంలో నిర్వహించిన గ్రామ సభకు హజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌జేడీ రవి, ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఇందిరా, సర్పంచ్ నాగమల్లారెడ్డి, ఎంపీటీసీ కృష్ణయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలు



పులివెందుల టౌన్ : శ్రావణమాసం 3వ శుక్రవారం మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పట్టణంలోని అమ్మవారిశాల, శ్రీచక్రసహిత మహాలక్ష్మి అమ్మవారి ఆలయాలను దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు.

రైతును శాస్త్రవేత్తగా మార్చడమే పొలంబడి లక్ష్యం



రైతులకు అవగాహన కల్పిస్తున్న జేడీఏ నాగేశ్వరరావు

కమలాపురం : గ్రామీణ ప్రాంతాల్లోని రైతులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే పొలంబడి లక్ష్యం అని జేడీఏ అయితా నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని మీరాపురం గ్రామంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పొలంబడి అనేది సాధారణ రైతులను శాస్త్రవేత్తలుగా తయారు చేయడమే ప్రధాన ఉద్దేశం అన్నారు. రైతులు పంట పరిసరాలలోని పర్యావరణ సంబంధమైన అంశాలను గమనించి, విశ్లేషించి, రసాయనిక వనరుల వినియోగాన్ని తగ్గించి, అధిక దిగుబడులు సాధించాలన్నారు. ముఖ్యంగా ఈ పద్ధతి ద్వారా సాగు ఖర్చులు ఆదా చేయడంతో పాటు సమగ్ర సస్య రక్షణ, సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర కలుపు యాజమాన్యంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. ముఖ్యంగా రైతే తమ పంటల సాగులో సొంత నిర్ణయాలు తీసుకునే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. అలాగే వరి పొలంలో వివిధ రంగుల జిగురు అట్టలు ఏర్పాటు చేస్తే కలిగే ప్రయోజనం గురించి వివరించారు. పసుపు రంగు జిగురు అట్టలకు తెల్లదోమ ఆకర్షించబడతాయన్నారు. నీలం రంగు జిగురు అట్టలకు తామర పురుగులు, తెలుపు రంగు జిగురు అట్టలకు చిత్త పురుగులు, బగ్స్ ఆకర్షించబడతాయన్నారు. ఏకరానికి 20 జిగురు అట్టలను ఉపయోగించాలన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి, ఏఈఓ దస్తగిరి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

టంగుటూరిని స్ఫూర్తిగా తీసుకోవాలి



మాట్లాడుతున్న డైరెక్టర్ కుమారస్వామిగుప్తా

వేంపల్లె : ఆంధ్రరాష్ట్ర మొట్టమొదటి ముఖ్యమంత్రిగా పనిచేసిన టంగుటూరి ప్రకాశం పంతులును ప్రతి విద్యార్థి స్ఫూర్తిగా తీసుకోవాలని ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామిగుప్తా తెలిపారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు పేద కుటుంబంలో పుట్టి అంచెలంచెలుగా ఎదిగారన్నారు. విద్యార్థులు కూడా కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. అదేవిధంగా చంద్రయాన్ 3 విజయవంతంగా చంద్రునిపై ల్యాంచ్ అయిన రోజుకు గుర్తుగా నేషనల్ స్పేష్ డేగా భారత ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. దేశఖ్యాతి నలుమూలల వ్యాపించేలా విద్యార్థులు వారి ఆశయాలే లక్ష్యంగా ఉండాలన్నారు. అలాగే జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు శివమునెమ్మ ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి రవి కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై దాడి కేసులో నిందితుడికి జైలు



పోలీసుల అదుపులో కుల్లాయప్ప

పులివెందుల : పట్టణంలోని దర్గా వీధిలో 2022 ఫిబ్రవరి 9వ తేదీన ఇంటి ఆస్తి విషయమై దర్గావీధిలో గొడవపడుతున్నట్లు డయల్ 100కు కాల్ వచ్చింది. దీంతో స్పందించిన బ్లుకోల్ట్ కానిస్టేబుల్ సునీల్‌కుమార్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని గొడవ విషయాన్ని విచారిస్తుండగా కుల్లాయప్ప అనే వ్యక్తి కానిస్టేబుల్‌పై బండరాయితో దాడి చేశారు. అప్పట్లో కానిస్టేబుల్ సునీల్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పుడు ఎస్సైగా ఉన్న గోపీనాథ్‌రెడ్డి కేసు నమోదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. కేసు విచారణ అనంతరం ముద్దాయి కుల్లాయప్పకు 4 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.4వేలు జరిమానా విధిస్తూ అడిషనల్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి తీర్పును ఇచ్చారు. ఈ కేసులో ముద్దాయికి శిక్ష పడేందుకు ప్రధానపాత్ర పోషించిన ఏపీపీ శేషయ్య, దర్యాప్తు అధికారి గోపీనాథరెడ్డి, కోర్టు కానిస్టేబుల్ నరసింహులు, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, డీఎస్పీ మురళీనాయక్‌లను అభినందించారు.

వాసవి మాతకు శతనామావళి పూజ



శతనామావళి పూజలో మహిళా మండలి సభ్యులు

వేంపల్లె : స్థానిక మెయిన్ బజార్‌లోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవి మాతకు శతనామావళి పూజ నిర్వహించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర తెలిపారు. శ్రావణమాసం మూడవ శుక్రవారం పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ నేతృత్వంలో అభిషేకం, కుంకుమార్చన, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు ప్రవీణ మాట్లాడుతూ ఆర్యవైశ్య కులదేవత అయిన వాసవిమాతను భక్తితో పూజించినా కొంగుబంగారమై వరాలిస్తుందని భక్తుల నమ్మకం. సాయంత్రం ఆలయ గర్భగుడి చుట్టూ ప్రాకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా మండలి ఉపాధ్యక్షురాలు నాగలక్ష్మి, కమిటీ సభ్యులు సంధ్యారాణి, ఆర్యవైశ్య యువజన సంఘం, ఆవోపా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



ఫాగింగ్ చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీలో దోమల నివారణకు చర్యలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ఆదేశాల మేరకు స్థానిక భాకరాపురంలోని రామాలయం వీధిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ఫాగింగ్ నిర్వహించారు. ప్రస్తుతం విషజ్వరాలు ప్రబలుతుండటంతో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టినట్లు తెలిపారు.

ఆసుపత్రులలో పెరుగుతున్న రోగుల సంఖ్య



సెలైన్ బాటిళ్లు ఎక్కించుకుంటున్న రోగులు

ఎర్రగుంట్ల : ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో వేడిని తట్టుకోలేక ఆసుపత్రులలో వారం రోజుల నుంచి రోగుల సంఖ్య అధికమైందని వైద్యులు తెలిపారు. ఆసుపత్రికి వచ్చిన ప్రతి రోగికి సెలైన్ బాటిళ్లు ఎక్కిస్తున్నామన్నారు. పట్టణ వైద్య కేంద్రం, పీహెచ్‌సీలలో రోగులు సంఖ్య పెరిగిందన్నారు.

అంతరిక్షంలో అద్భుత ఫలితాలు సాధించాలి



పెద్దచెప్పలిలో విద్యార్థులు తయారు చేసిన నమూనాలతో ఉపాధ్యాయులు



పులివెందులలో చంద్రయాన్-3 రాకెట్ నమూనా ప్రదర్శన

కమలాపురం : ఇస్రో శాస్త్రవేత్తల స్ఫూర్తితో విద్యార్థులు అంతరిక్షంలో అద్భుత ఫలితాలు సాధించాలని పెద్దచెప్పలి జడ్పీ హైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ పుల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ పాఠశాల బయాలజీ ఉపాధ్యాయుడు, సీవీ రామన్ సైన్స్ క్లబ్ కడప డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి రూపొందించిన ఇస్రోకు సంబంధించిన పోస్టర్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు గ్రహాలు, ఉప గ్రహాలు, రాకెట్లు తదితర వాటి నమూనాలు తయారు చేసి వాటి పనితీరును వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2023 జూలై 14వ తేదీన ఇస్రో చంద్రయాన్ 3 అంతరిక్ష యాత్ర చేపట్టి ఆగస్టు 23వ తేదీన ల్యాండర్‌ను చంద్రుడిపై దింపింది. దీంతో ప్రతి ఏటా ఆగస్టు 23వ తేదీన జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించాలని కేంద్రం ప్రకటించిందన్నారు. ఈ నేపథ్యంలో మన పాఠశాలకు చెందిన విద్యార్థులు అంతరిక్షంకు సంబంధించిన గ్రహాలు, ఉపగ్రహాలు తదితర వాటి నమూనాలు తయారు చేయడం, చిత్ర లేఖనం వేయడం హర్షణీయం అన్నారు. విద్యార్థులు ఇస్రో శాస్త్రవేత్తల స్ఫూర్తితో భవిష్యత్తులో అంతరిక్షంలో మరిన్ని అద్భుత ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం నమూనాలు తయారు చేసిన, చిత్ర లేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల టౌన్ : చంద్రయాన్–3 విజయంతో అంతరిక్ష రంగంలో చంద్రుని సౌత్‌పోల్‌పై కాలుమోపిన మొదటి దేశంగా భారత్ నిలిచిందని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల హెచ్ఎం బండి సుధాకర్‌రెడ్డి తెలిపారు. పాఠశాల సైన్స్, సోషియల్ ఉపాధ్యాయులు అబ్దుల్ లతీఫ్, సనావుల్లా, ఫర్దోష్ జహాన్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ అంతరిక్ష దినోత్సవ సందర్భంగా పాఠశాలలో చంద్రయాన్-3, వర్కింగ్ నమూనాలను చార్ట్‌లతో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో పెట్టారు. ఎన్నో అభివృద్ధి చెందిన దేశాలకు సాధ్యం కాని ఘనత భారత్‌కు సాధ్యమైందన్నారు. విద్యార్థులు ఇంత గొప్ప నమూనాలను ఎంతో చక్కగా ప్రదర్శించడంపై వారిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపు కేసు నమోదు

వేంపల్లె : తిరుపతి జిల్లా పాకాల గ్రామానికి చెందిన ముద్ద జవహర్‌బాబుపై వరకట్న వేధింపు కేసు నమోదు చేసినట్లు సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేంపల్లె శ్రీరాంనగర్ వీధికి చెందిన మంచాల ప్రవల్లికతో ముద్ద జవహర్‌బాబుకు రెండు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. కొద్దిరోజుల నుంచి భర్త జవహర్‌బాబు, అత్త, బావ, తనను రోజు మానసికంగా, శారీరకంగా హింస పెడుతూ అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారని ఆమె ఫిర్యాదు చేశారని తెలిపారు. పోలీసులు విచారణ చేపట్టి జవహర్ బాబుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

జూదరుల అరెస్టు

ముద్దనూరు : మండలంలోని కొత్తపల్లె శివారులో శుక్రవారం పేకాట ఆడుతున్న 6 మంది జూదరులను అరెస్టు చేసి వారివద్దనుంచి రూ.21,050 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను జయప్రదం చేయండి

కమలాపురం : స్థానిక రైల్వే గేటు సమీపంలో వెలసిన శ్రీకృష్ణాలయం 8వ వార్షికోత్సవ వేడుకలను ఈనెల 26న నిర్వహిస్తున్నామని ఆలయ వ్యవస్థాపకుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం నుంచి రాత్రి వరకు జరిగే వివిధ రకాల పూజలు, బండలాగుడు, ముగ్గుల పోటీలకు ప్రజలు, భక్తులు విరివిగా పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మహా సభ లోగో ఆవిష్కరణ

కడప రూరల్: రెవల్యూషనరీ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యు) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 13, 14, 15వ తేదీల్లో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో నిర్వహించే ప్రథమ జాతీయ మహా సభభ లోగోను శుక్రవారం వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి ఆవిష్కరించారు.

ఘనంగా చర్చి సిల్వర్ జూబ్లీ వేడుకలు



వేడుకల్లో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మత పెద్దలు

వల్లూరు : మండలంలోని పైడికాలువ గ్రామంలో వెలసిన పునీత మరియ మాత మాతృత్వపు దేవాలయ (చర్చి) సిల్వర్ జూబ్లీ వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. చర్చి ప్రారంభమై 25 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా విచారణ గురువు ఫాదర్ జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకల్లో సాయంత్రం జపమాల కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గురువులు కడప జిల్లా డీన్ ఫాదర్ ప్రసాద్‌రావు, చాన్సెలర్ సగినల ప్రకాష్ చేతుల మీదుగా పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం దివ్య బలిపూజ నిర్వహించారు. మహిళలకు, పురుషులకు వేరు వేరుగా కబడ్డీ, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్స్ వంటి ఆటల పోటీలను నిర్వహించారు. రాత్రి జరిగిన ఇంద్రజాల, మిమిక్రీ ప్రదర్శనలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో క్రైస్తవ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిద్ధయ్య

సింహాద్రిపురం : ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య తెలిపారు. శుక్రవారం బిదినంచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని గురిజాలలో ఫ్రైడే డ్రైడే సందర్భంగా ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి ప్రజలకు మలేరియా, డెంగీ వ్యాధుల గురించి అవగాహన కల్పించి మాట్లాడారు. ప్రజలు దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమకాటు వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, బోదకాలు, మెదడువాపు వంటి వ్యాధులు వస్తాయన్నారు. లోతట్టు ప్రదేశాలను, వాడని బావులను పూడ్చి నీరు నిల్వలేకుండా చూడాలన్నారు. చెత్తాచెదారాలు మురుగు కాల్వలో చేరకుండా మురుగు నీరు పారేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సుకుమార్, ఆరోగ్య కార్యకర్త రమాదేవి, ఆశాకార్యకర్తలు పద్మావతి, రాజా, రత్నమ్మలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



ముద్దనూరు : మండలంలోని ఉప్పలూరు గ్రామంలో ఓ విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా వుంది. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల సమీపంలోని వీధిలో విద్యుత్ స్తంభం చివరన విరిగి కూలిపోయేదశలో వుంది. ఇప్పటికే పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకరంగా వున్న విద్యుత్ స్తంభం పరిసరప్రాంతాల్లో విద్యార్థులు సంచరిస్తూవుంటారని అధికారు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించండి



వీరపునాయునిపల్లెలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చైతన్యకుమార్‌రెడ్డి



లింగాలలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ లోకేశ్వరరావు

వేంపల్లె : వేంపల్లె గ్రామం అభివృద్ధికి ప్రతి ఒక్కరు తోడ్పాటు అందించాలని సర్పంచ్ శ్రీనివాసులు కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో గ్రామ సభ నిర్వహించారు. వేంపల్లెలో ఆయా ప్రాంతాల నుంచి అర్జీదారులు లిఖితపూర్వక అర్జీలు అందజేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండల వ్యాప్తంగా దాదాపు రూ.1.44 కోట్ల మేర ఆయా పనులకు నిధులు మంజూరైనట్లు గ్రామ సభ ప్రత్యేక అధికారి, పీఆర్ ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు వెల్లడించారు. అందులో వేంపల్లె గ్రామ పంచాయతీకి రూ.కోటి మేర పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు. వేంపల్లె పంచాయతీ పరిధిలోని ఆయా ప్రాంతాలకు సంబంధించి సీసీరోడ్లు, కాంపౌండ్ వాల్, మెటల్‌రోడ్లు, డ్రైనేజీ పారిశుద్ధ్యం, వీధిదీపాలు, మంచినీటి సరఫరా తదితర అంశాలపై ప్రజాప్రతినిధులు, నాయకులు అధికారులకు అర్జీలు అందజేశారు. వేంపల్లె పంచాయతీ పరిధిలో ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని సర్పంచ్, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పశువుల షెడ్లు ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీ కింద నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దాదాపు రూ.2 కోట్లు హార్టికల్చర్ కింద పనులు చేపట్టనున్నట్లు ఏపీఓ పార్వతి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ సుబ్బారెడ్డి, ఆయా శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, టీడీపీ, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

వీరపునాయునిపల్లె : రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పుత్తా చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పంచాయతీ సర్పంచు మణికంట అధ్యక్షతన జరిగిన గ్రామ సభకు ఆయన హాజరై మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడంలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలన్నారు. పంచాయతీలకు మొదటి ప్రాధాన్యత కింద తాగునీరు, మురుగు కాలువల నిర్మాణం పనులు చేపట్టాలని తరువాత శాశ్వత నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి నాగభూషణ్‌రెడ్డి, ఉప సర్పంచు రవీంద్రనాథ్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహం ప్రారంభం

వీరపునాయునిపల్లెలో నూతనంగా మంజూరైన బాలికల వసతి గృహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని తల్లితండ్రులు, ఉపాధ్యాయులు గర్వించే విధంగా విద్యనభ్యసించాలని సూచించారు. బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి భరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వసతి గృహంలోని బాలికలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. ప్రస్తుతం సంగమేశ్వర పాఠశాలలో నిర్వహిస్తున్నామని త్వరలో సొంత భవనాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి జాఫర్ సాధిక్, సంగమేశ్వర విద్యా సంస్థల అధ్యక్షుడు వెంకటసుబ్బానాయుడు తదితరులు పాల్గొన్నారు.

సజావుగా గ్రామ సభలు

లింగాల : మండలంలోని 19 పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు సజావుగా నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ లోకేశ్వరరావు ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లోని పాఠశాలల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనుల నిర్వహణకు తగిన నివేదికలు అందించాలన్నారు. ఉపాధిహామీ ద్వారా ఉద్యాన పంటలను విస్తృతపరచాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామసభల ద్వారా సమస్యల గుర్తింపు

సింహాద్రిపురం : గ్రామసభల ద్వారా గ్రామాల్లోని సమస్యలను గుర్తించి పరిష్కారం కోసం కృషి చేస్తామని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం మండలంలోని కసనూరు, హిమకుంట్ల పంచాయతీల్లో ఆయన పాల్గొని రైతులకు ఉపాధి ద్వారా పండ్ల తోట పెంపకాలు, మట్టిరోడ్డు పొలాల చుట్టూ కందకాలు ఏర్పాటు చేసుకోవడానికి కావాల్సిన పనుల వివరాలను రైతులు తెలపాలన్నారు. అనంతరం కసనూరు సచివాలయ పరిధిలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ రమణమ్మ, పంచాయతీ సెక్రటరీ, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే గ్రామ సభలు

పులివెందుల రూరల్ : సమస్యలు తెలుసుకునేందుకే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేష్ తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో సీసీరోడ్లు, తాగునీటి, సమస్య పారిశుద్ధ్యం, ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టవలసిన పనుల గురించి చర్చించామన్నారు. మండలంలోని రాగిమానుపల్లె పంచాయతీలో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచ్ మౌనిక, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అందరికీ ఉపాధి కల్పిస్తాం

కమలాపురం : ఉపాధి హామీ పనులు కావాలని అభ్యర్థించిన ప్రతి ఒక్కరికి పనులు కల్పించి వారిని ఆదుకుంటామని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి తెలిపారు. శుక్రవారం దేవరాజుపల్లెలో ఉపాధి హామీ పథకం శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి మాట్లాడుతూ దేవరాజుపల్లె పంచాయతీలో అభివృద్ధి పనులు చేపట్టి సౌకర్యాలు మెరుగుపరిచి ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతి, ఎంఎస్ఓ నరసింహారెడ్డి, ఏపీఓ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.